

8



ముగిసిన వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవం

ఆదివారం ప్రత్యేకం



సర్కారు ఏం చేయగలదు?
అధికారంతో ఏదైనా చేయగలదు..
అభివృద్ధి చేయగలదు..
అరాచకమూ సృష్టించగలదు..
గత ఐదేళ్లూ జనం అరాచకం చూశారు..
భరించలేక ఓటుతో తరిమికొట్టారు...
ప్రభుత్వాన్నే మార్చేశారు..
ఇప్పుడేం చూస్తున్నారు?
హామీల అమలు చూస్తున్నారు..
అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారు..
గూగుల్ రాకతో మన గతి
సూపర్ అంటూ ఆనందపడుతున్నారు..
చీకట్లు తరిమికొట్టే చంద్రన్న పాలనలో
ఆనంద దీపావళికి సన్నద్ధమవుతున్నారు..

దీపావళి.. చెడుపై విజయానికి సూచిక.. చీకట్లు తొలగించి వెలుగులు అందించే పండగ.. గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనతో చీకట్లు కమ్ముకున్నాయి.. కూటమి ప్రభుత్వంలో ఎన్నో కొత్త వెలుగులు వచ్చాయి. పింఛన్ల పెంపు నుంచి ఉచిత గ్యాస్, ఫ్రీబస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆటో డ్రైవర్ల సేవలో, విద్యుత్ బిల్లుల తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజల జేబుల్లో కాసులు గలగలలాడుతున్నాయి. అటు కొత్తరేషన్ కార్డులు, పాస్ పుస్తకాల జారీ. గుంతల్లేని రహదారులు, ఇటు అభివృద్ధి, అటు పెట్టుబడుల వెల్లువతో జిల్లా ముఖచిత్రం మళ్లీ మారుతోంది. మూతపడ్డ అన్న క్యాంటీన్లను మళ్లీ తెరిపించి రూ.5కే పేదలు కడుపునిండా భోజనం చేసేలా చేస్తోంది. డీఎస్సీ పోస్టుల మొదలు మళ్లీ వచ్చే ఏడాది ఇంకో డీఎస్సీ అటు పోలీస్, అటవీశాఖల్లో పోస్టుల భర్తీతో నిరుద్యోగుల మోము మతాబుల్లా వెలుగుతోంది.

- అరాచకపు చీకట్లు తొలగాయ్
- అభివృద్ధి వెలుగులొస్తున్నాయ్
- సంక్షేమంతో మంచి రోజులు
- సూపర్ సిక్స్ పథకాలతో వెలుగు
- పోస్టుల భర్తీతో నిరుద్యోగుల సంతోషం
- రేపే దీపావళి

నాడు కష్టాలు.. నేడు వెలుగులు

- **పింఛన్ల ధమాకా :** ప్రభుత్వం మారింది.. ప్రజల దశ మారింది. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు రూ.3 వేల పింఛన్ రూ.4 వేలు, అనారోగ్య బాధితులకు రూ.15 వేల చొప్పున పెంచి ఒకటో తేదీనే అందజేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 2,72,107 మందికి రూ.117 కోట్లు, కోనసీమలో 2,36,705 మందికి రూ.101 కోట్లు, తూర్పులో 2,35,502 మందికి రూ.103 కోట్లు అందుతున్నాయి. ఉద్యోగులకు ఒకటినే జీతాలిస్తున్నారు.
- **తల్లికి వందనం :** ఇచ్చిన హామీ మేరకే ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లివందనం డబ్బులు పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో 5,88,378 మంది విద్యార్థులకుగాను 3, 85,601మంది తల్లులఖాతాల్లో రూ.764 కోట్లు జమైంది.
- **ఉచిత గ్యాస్ :** ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ అమలవుతోంది. ఉమ్మడి జిల్లాలో 13 లక్షలగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తొలి ఉచిత సిలిండర్ 11.52 లక్షల మంది వినియోగించుకోగా రూ.95 కోట్లు జమచేసింది.
- **ఉచిత బస్సు:** ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం అమలుచేసింది. ఉమ్మడి జిల్లాలో 25.52 లక్షల మందికిపైగా మహిళలకు లబ్ధి చేకూరుతోంది.
- **అన్నదాత సుఖీభవ :** ఈ పథకం కింద కేంద్రం ఇచ్చే రూ.2 వేలకు, రాష్ట్రప్రభుత్వం రూ.5వేలు కలిపి మొదటి విడతగా రూ.7 వేలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాలుగు లక్షల మందికిపైగా రూ.300 కోట్లకుపైగా జమ చేసింది.
- **పాస్‌బుక్‌లు :** ఐదేళ్లపాటు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు ఇవ్వకుండా గత వైసీపీ తిప్పలు పెట్టింది.ప్రభుత్వం మారాక రాజముద్రతో కాకినాడ జిల్లాకు 1.47 లక్షలు, కోనసీమ 1.02 లక్షలు, తూ.గో. 95 వేలు జారీ చేశారు.
- **డీఎస్సీ సక్సెస్ :** గత ఐదేళ్లపాటు ఆచూకీ లేని డీఎస్సీ పోస్టులను భర్తీ చేశారు. ఉమ్మడి జిల్లాలో 1,241 మంది నిరుద్యోగులకు ప్రభుత్వ కొలువులు దక్కాయి. వచ్చే ఏడాది మరో డీఎస్సీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.
- **ఉద్యోగులకు డీఏ :** దీపావళి కానుకగా ప్రభుత్వం ఉద్యోగులకు శనివారం ఒక డీఏ ప్రకటించింది. పోలీసులకు ఒక ఇన్‌స్టాల్‌మెంట్ ఈఎల్ ప్రకటించింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఎర్న్‌లీవ్ ఇన్‌స్టాల్‌మెంట్‌తోపాటు దీపావళికే పదోన్నతులు ఇస్తామని ప్రకటించింది.
- **జీఎస్టీ పండుగ :** ఇక కేంద్రం జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలు లాభపడ్డారు. నిజమైన దీపావళి ఇది.

రోడ్లు వేశారు.. నరకం తప్పించారు!

వైసీపీ పాలనలో ప్రజలు రహదారులపై నరకం చూశారు. ప్రభుత్వం మారగానే సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలో 900 కిలోమీటర్ల మేర అధికారులు 350కిపైగా రోడ్లను గుర్తించి రూ.70.76 కోట్లు వెచ్చించి గుంతలు పూడ్చారు. కాకినాడ- జొన్నాడ రహదారి రూ.225 కోట్లు, కాకినాడ -రాజమండ్రి కెనాల్ రోడ్డు రూ.160 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నారు.

పరిశ్రమలు వస్తున్నాయ్..

సీఎం చంద్రబాబు కృషితో అనేక కంపెనీలు, పర్యాటక ప్రాజెక్టులు తరలివస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన గ్రీన్ కో కంపెనీ కాకినాడలో రూ.13 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్, రూ.2,800 కోట్లతో కొత్తగా ఎలక్ట్రోలైజర్ల తయారీ ప్లాంట్‌కు ఏర్పాటు చేయనుంది. కోనసీమ, కాకినాడలో రూ.300 కోట్లు పర్యాటక పెట్టుబడులు పెట్టనున్నారు.

నాడు మైక్రోసాఫ్ట్.. నేడు గూగుల్

నేడు హైదరాబాద్ ఇలా ఉందంటే దానికి కారణం చంద్రబాబు.. ఎందుకంటే నాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ను రప్పించారు.. నేడు విశాఖకు గూగుల్ రప్పిస్తున్నారు. దీంతో నిరుద్యోగుల కష్టాలు తీరనున్నాయి. కొత్త వెలుగులు రానున్నాయి.. తూర్పుగోదావరి జిల్లాలో టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుచేశారు. మీకో బిజినెస్ ఐడియా ఉందా.. అక్కడికి వెళితే చాలు అంతా వాళ్లే చూసుకుంటారు.

మందు పార్టీకి పిలిచి..
పీక కోసి చంపేసి...
కాకినాడలో యువకుడి దారుణ హత్య
ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ఘాతుకం
పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
8
సొంత ఊరికి ఆనందంగా పయనం..
అంతలోనే విషాదం
ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్
భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు

ఎట్టకేలకు స్వాధీనం

దేవదాయశాఖకు రూ.20 లక్షలు బకాయిపడ్డ మాజీ కార్పొరేటర్

షాపు లీజు, అద్దె బకాయిలు చెల్లించకుండా వ్యాపారం

రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమక్షంలో షట్టర్ తొలగింపు

షాపులో ఉన్న వస్తువుల స్వాధీనం



షాపును స్వాధీనం చేసుకుని బోర్డు తొలగిస్తున్న దృశ్యం

కాకినాడ, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఒకటికాదు.. రెండు కాదు ఏకంగా రూ.20 లక్షల మేర బకాయిపడిన ఆ దుకాణదారుడిపై దేవదాయశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. ఏళ్ల తరబడి లీజు చెల్లించకుండా దర్జాగా వ్యాపారం చేసుకుంటూ.. ఆ శాఖ అధికారులు, సిబ్బందికి మొండిబకాయిదారుగా తయారైన ఆక్రమణదారుడిపై ఎండోమెంట్ శాఖ ఉన్నతాధికారులు తమ అధికార రుచిని చూపించారు. పదేళ్ల నుంచి కాకినాడ మెయిన్‌రోడ్డులోని చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ ఎదురుగా ఉన్న విజోస్ హోమ్ దేవదాయ శాఖకు చెందిన దుకాణా సముదాయంలో 13,14,15,16 నంబర్లు గల షాపులను బవులూరి రామకృష్ణ అనే ఓ మాజీ కార్పొరేటర్ లీజుకు తీసుకున్నారు. లీజు ఉత్తర్వులు ముగిసినా.. అద్దె చెల్లించకుండా పూర్తిగా ఆక్రమించుకుని వ్యాపారం సాగిస్తూ 2025 సెప్టెంబర్ 30 నాటికి రూ.19,60,742బకాయిపడ్డారు. ఈ బకాయి సొమ్ము వసూలుకు దేవదాయశాఖ అధికారులు అనేకసార్లు నోటీసులు ఇచ్చారు. అయినా బకాయిదారుడు స్పందించలేదు. మాజీ కార్పొరేటర్, అన్నీ తెలిసిన రాజకీయ నాయకుడనే ఉద్దేశంతో దేవదాయశాఖ అధికారులూ అయనపై ఒత్తిడి తీసుకురాలేకపోయారు. ఈ మొండిబకాయిదారుడిపై చర్యలు తీసుకోవాలని అధికారులు కోర్టును కూడా ఆశ్రయించారు. చివరకు అధికారులు సెక్షన్ 83(2)ను ప్రయోగించారు. బవులూరి రామకృష్ణకు ఆగస్టు 18న నోటీసు జారీచేశారు. శనివారం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ కనపర్తి నాగేశ్వరరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, పలు ఆలయాల ఈవోలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బందితో కలిసి 13, 14, 15, 16 దుకాణాలను అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్న శ్రీరామ ఆప్టికల్స్ దుకాణ షట్టర్లకు ఉన్న తాళాలను కట్టర్‌తో తొలగించారు. షాపులో ఉన్న కళ్లజోళ్లు, ఏసీలు, గ్లాసుల విలువలను లెక్కించారు. ఈ షాపులో ఉన్న మొత్తం సామగ్రిని వేలంవేసి, వచ్చిన ఆదాయాన్ని జమచేసుకుంటామని దేవదాయశాఖ అధికారులు మీడియాకు తెలిపారు. ఆ షాపనకు ఉన్న శ్రీరామ ఆప్టికల్స్ బోర్డును తొలగించి హెచ్చరిక బ్యానర్‌ను ఏర్పాటు చేశారు.

గోర్స సీతారామస్వామి ఆలయభూములు స్వాధీనం

నాలుగు దశాబ్దాల పోరాట ఫలితం

కొత్తపల్లి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం గోర్స సీతారామస్వామి ఆలయభూములు కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి విముక్తి లభించింది. దేవదాయ ధర్మాదాయ ట్రిబ్యునల్ తీర్పు మేరకు కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలతో ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో కాకినాడ ఆర్డీవో ఎస్‌మల్లిబాబు, డీఎస్సీ దేవరాజ్ మనీష్‌పాటిల్ సహకారంతో శనివారం కొమరగిరిలో సర్వేనంబరు 121/122లో గల 19ఎకరాల 19 సెంట్ల గోర్స సీతారామస్వామి ఆలయభూములను స్వాధీనం చేసుకొన్నారు. ఈ భూములను 40 ఏళ్ల కిందట కొంతమంది రైతులు కౌలుకు తీసుకొని సాగు చేసేవారు. ఇలా సాగుచేస్తూ భూములపై వచ్చే ఆదాయంతో కౌలు రైతులు ఇచ్చే సొమ్ముతో సీతారామస్వామికి ధూపదీప నైవేద్యాలు సమకూర్చేవారు. తర్వాత శిస్తు చెల్లించడం మానేశారు. దీంతో స్వామివారికి ధూపదీప నైవేద్యాలకు గ్రామస్తులు చందాలు వేసుకొని స్వామికి కైంకర్యాలు చేపట్టేవారు. ఆ కౌలురైతులపై కొందరు గ్రామస్తులు వివిధ కోర్టుల్లో కేసులు దాఖలు చేశారు. చివరకు ట్రిబ్యునల్ ఆదేశాలతో వారి చెర నుంచి భూములను విడిపించారు.



గోర్స దేవాలయ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి భూమి తాలూకు పత్రాన్ని ఈవోకు అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్

ముగిసిన బ్రహ్మోత్సవం



చక్రస్నాన మహోత్సవంలో ఎమ్మెల్యే బండారు, చైర్మన్, ఈవో

- వైభవంగా స్వామివారి చక్రస్నానం
- మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం
- స్వామివారి ఏకాంత సేవ
- ముగింపు ఉత్సవంలో పాల్గొన్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే బండారు





వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనం



నవకుంభ ఆవాహన నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

ఆత్రేయపురం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేకువ జామునే స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వసంత మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామి వారిని దర్శించుకుని బ్రహ్మోత్సవ పూజల్లో పాల్గొన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతోపాటు తనయుడు సంజీవ్ దంపతులు స్వామివారిని దర్శించుకుని మహాపూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారు వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణ నడుమ మేళతాళ మంగళ వాయిద్యాలతో గౌతమి గోదావరివద్దకు చేరుకున్నారు. అనంతరం స్వామివారి చక్రస్నాన మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు.



ధ్వజపతాకాన్ని తీసుకువస్తున్న చైర్మన్, ఈవో

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు, ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు దంపతులు, అమలాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులు స్వామివారి చక్రస్నాన మహోత్సవంలో పాల్గొని తన్మయత్వం పొందారు. వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు బ్రహ్మోత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించారు. రాత్రి స్వామివారి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, మహాదాశీర్వచనం నిర్వహించి స్వామి వారి అద్దాల మండపంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఉయ్యాలలో స్వామివారి ఏకాంత సేవ కనుల పండువగా నిర్వహించారు. 9 రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల వాయిద్యాలు, విద్యుత్, ఫులపుష్పాలంకరణ, ఫొటోషూట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి.

పోటెత్తిన భక్తజనం...

శనివారం వివిధ రాష్ట్రాల నుంచి భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమాడవీధులలో ఏడుప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, కానుకలు సమర్పించుకుని స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.62.13 లక్షల ఆదాయం లభించినట్టు ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

నేటి నుంచి ఆర్జిత సేవలు

స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియడంతో స్వామివారి ఆర్జిత సేవలు ఆదివారం నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అష్టోత్తర పూజలు, కల్యాణాలు నిర్వహించుకునే భక్తులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు నిర్వహించి తూర్పు రాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించి అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత నారాయణశర్మ

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం ఇద్దరు దాతల నుంచి రూ.2.50 లక్షలు విరాళంగా సమకూరాయి. హైదరాబాద్‌కు చెందిన కె.నారాయణశర్మ రూ.1,00,116... కాకినాడకు చెందిన కురువెల్ల విజయబాబు రూ.1.50 లక్షలు విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. దాతల వెంట రెవెన్యూ ప్రొటోకాల్ భాస్కరప్రసాద్, టీడీపీ నాయకుడు పసుపులేటి చక్రి తదితరులున్నారు.

మురమళ్ల వీరేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.21.39 లక్షలు

ఐ.పోలవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి హుండీల్లో కానుకలను లెక్కించగా 206 రోజులకు రూ.21.39 లక్షల ఆదాయం చేకూరిందని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎస్వీ ప్రసాద్, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు సమక్షంలో శనివారం హుండీలను లెక్కించారు. ప్రధాన హుండీ ద్వారా రూ.21,05,651, అన్నదాన హుండీ ద్వారా రూ.33,490 సమకూరింది. మొత్తం ఆదాయం రూ.21,39,141గా ప్రకటించారు. దీంతో పాటు 17 గ్రాముల బంగారం, 181 గ్రాముల వెండి సమకూరింది. తొలుత అర్చకుడు పేటేటి శ్యామల కుమార్ హుండీలకు హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు, సిబ్బంది మల్లిబాబు, గొలకోటి బుజ్జి, మాచరయ్యతో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు, రెవెన్యూ, పోలీసు, బ్యాంకు సిబ్బంది, సత్యసాయి సేవాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ ప్రారంభం



తలపడుతున్న ఫెన్సింగ్ క్రీడాకారులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తుమ్మల బాబు

సామర్లకోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఉండూరు ఏడీబీ రోడ్డులో లక్ష్య ఇంటర్‌నేషనల్ విద్యాసంస్థ ఆవరణలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ఫెన్సింగ్ క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. 12వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ అండర్-14 బాలురు, బాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ముఖ్య అతిథులు ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జీఎస్వీ. కృష్ణమోహన్, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ దీపక్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాసు మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడ ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, క్రమశిక్షణ జీవితంలో భాగమవుతుందన్నారు. ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండ బాబు, పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రసంగించారు. లక్ష్య ఇంటర్‌నేషనల్ స్కూల్ డైరక్టర్, ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా సుగుణారెడ్డి మాట్లాడుతూ అండర్-14 విభాగంలో ఏపీలోని 13 జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు విచ్చేశారన్నారు. న్యాయనిర్ణేతల సమక్షంలో అండర్ -14 కేటగిరిలో వ్యక్తిగత, జట్టు విభాగాల్లో ఫాయిల్, సబెర్, ఏపీ కేటగిరిలో పోటీలు నిర్వహించామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ వందన బోహ్రా, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన న్యాయనిర్ణేతలు, కోచ్‌లు, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.

సొంత ఊరికి ఆనందంగా పయనం.. అంతలోనే విషాదం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు



మృతిచెందిన వసంత కుమార్

ప్రత్తిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై ఆగి ఉన్న పార్సిల్ లారీని బైక్ ఢీ కొన్న దుర్ఘటనలో భర్త మృతిచెందగా భార్య తీవ్రంగా గాయ పడింది. పోలీసుల అందించిన సమాచా రం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరాంధ్రలోని ఇచ్ఛాపురం సమీపంలో లొట్టు కుట్టి గ్రామానికి చెందిన వసంత కుమార్, సంధ్య భార్యాభర్తలు. విజయవాడ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఓ ప్రైవేట్ కంపెనీలో భర్త వసంత కుమార్ ఉద్యోగం చేస్తూ దీపావళి సందర్భంగా మూడు రోజుల సెలవులు రావడంతో శనివారం తెల్లవారుజామున బైక్‌పై హనుమాన్ జంక్షన్ నుంచి ఇచ్ఛాపురానికి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బైక్ ధర్మవరం జాతీయ రహదారిపై చేరుకుంది. ఉదయం ఐదు గంటల సమయంలో రోడ్డు పక్కన టైరు పంక్చర్ అయిన పార్సిల్ లారీ నిలిచిపోయింది. దీనిని గమనించక బైక్ వేగంగా వచ్చి లారీని ఢీకొంది. ఈ ఘటనలో వసంత కు మార్ (35) అక్క డికక్కడే మృతిచెందగా సంధ్యకు తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయింది. సంఘటనా స్థలాన్ని స్థానిక ఎస్ఐ ఎస్. లక్ష్మీకాంతం పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్పృహ కోల్పోయిన సంధ్యను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు. వసంతకుమార్, సంధ్యకు మార్చిలో వివాహం జరిగింది. పెళ్లయిన 7 నెలలకే ఈ ఘటన జరిగి వసంతకుమార్ మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. దీపావళికి సొంత ఊరిలో ఆనందంగాగ డుపుదామనుకున్నా ఆ జంటను రోడ్డు ప్రమాదం విడదీసిందని విలపిస్తున్నారు.

మందు పార్టీకి పిలిచి... పీక కోసి చంపేసి...

- కాకినాడలో యువకుడి దారుణ హత్య
- ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ఘాతుకం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం



శామ్యూల్ రాజు (ఫైల్)



విలపిస్తున్న శామ్యూల్ పిన్ని

కాకినాడ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని ప్రేమ వ్యవహారం కడతేర్చింది. ఈ దారుణ హత్య శనివారం కాకినాడలో జరిగింది. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం రజకపేటకు చెందిన గంటా శామ్యూల్ రాజు (18)కి తల్లి సత్యవేణి, 9వ తరగతి చదువుతున్న చెల్లి కీర్తన ఉన్నారు. అతడి తండ్రి వీరబాబు కొంతకాలం క్రితం మృతి చెం దడంతో కుటుంబ భారం సత్యవేణిపై పడింది. ఆమె దోశ, ఇడ్లీ పిండి దుకాణాలకు వేస్తూ జీవనం సాగిస్తుంది. తల్లికి చేదోడువాదోడుగా ఉండేందుకు శామ్యూల్ రాజు గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి వరకు చదివి మానేశాడు. గత కొన్నేళ్లుగా తన ఇంటి సమీపంలోని సెల్ పాయింట్‌లో పని చేస్తూ తల్లికి ఆసరాగా ఉంటున్నాడు. అయితే తనతోపాటు చదువుకున్న పాఠశాల స్నేహితుడైన స్థానిక ఎల్విన్‌పేటకు చెందిన అభివర్దన్ అలి యాస్ అభికి శామ్యూల్ రాజుకు మధ్య గతంలో ప్రేమ వ్యవహారంలో మనస్పర్థలు వచ్చి అది కాస్తా అభి మనస్సులో కక్షగా నాటుకుపోయింది. అప్పటి నుంచి శామ్యూల్ రాజుని అంతమొందించేందుకు అభి సమయం కోసం వేచిచూస్తున్నాడు. శామ్యూల్ రాజుతో మంచిగా ఉన్నట్టే నటిస్తున్నాడు. ఈ క్రమంలో పథకం ప్రకారం... శుక్రవారం రాత్రి శామ్యూల్ రాజుకు ఫోన్ చేసి మందు పార్టీ చేసుకుందాం రమ్మన్నాడు. దీంతో శామ్యూల్ రాజు సెల్ పాయింట్ కట్టేసి తన స్నేహితుడు రమ్మన్న ప్రదేశం కొండయ్యపాలెం శారదమ్మ గుడి సమీపంలోని చీడీల పోర రోడ్డులోని నగరపాలక సంస్థ మేజర్ డ్రైన్ అవతల నిర్జల ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ అప్పటికే అభి తన స్నేహితుడు శ్రీనివాస్‌తో వేచి చూస్తున్నాడు. ముగ్గురు కలిసి పార్టీ చేసుకున్న అనంతరం అభి మనస్సులోని పగ వెల్లగక్కి ఇద్దరు కలిసి శామ్యూల్ రాజుపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపు అభి తన కూడా తెచ్చుకున్న చాకుతో శామ్యూల్ రాజు పీక కోయడమే కాకుండా ఇంకా చావలేదని పీకకు తాడు వేసి ఆ డ్రైనేజీలో ముంచాడు. చనిపోయాడని నిర్ధారించుకున్నాక పైకి తీసి శామ్యూల్ రాజు మృతదేహాన్ని అక్కడ వదిలేసి ఇద్దరు పరారయ్యారు. శనివారం ఉదయం అటువైపు బహిర్భూమికి వచ్చిన వారు చూసి స్థానికులను విషయాన్ని తెలియజేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడికి చేరుకున్న కుటుంబీకుల నుంచి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. సంఘటనా స్థలి వద్ద మృతుడి తల్లి సత్యవేణి, చెల్లి కీర్తన విలపించిన తీరు చూపరుల మనస్సులను కలచివేసింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను శనివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నట్టు సీఐ తెలిపారు.

నమ్మించి నట్టేట ముంచి..

చిట్టీలు, అధిక వడ్డీ ఆశ చూపి రూ.కోటికి టోకరా

పెద్దాపురం పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పెద్దాపురం పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు

పెద్దాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో నమ్మకంగా ఉంటూ నట్టేట ముంచేశాడు ఓ వ్యక్తి. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామానికి చెందిన ఎలుబండి చక్రపాణి గ్రామంలో ప్రజలతో నమ్మంగా ఉంటూ వారి దగ్గర నుంచి దశలవారీగా చిట్టీలు కట్టించుకోవడం, అధిక వడ్డీ ఇస్తానని నమ్మబలికి దఫ దఫాలుగా రూ.కోటి వరకూ సొమ్ములు లాగేశాడు. గ్రామానికి చెందిన సుమారు 80 మంది అతడి వలలో పడి డబ్బులు పోగొట్టుకున్నారు. బాధితులు తమ డబ్బులు కావాలని అడగడంతో దాటవేత ధోరణి ప్రదర్శించడంతో అ నుమానం కలిగింది. దీంతో డబ్బుల కోసం చక్రపాణిని గట్టిగా ప్రశ్నించడంతో బాధితులపై ఎదురుదాడికి దిగాడు. దీంతో వారంతా స్థానిక పోలీస్‌స్టేషను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. ఈ విషయంపై ఎస్ఐ మౌనికను వివరణ కోరగా ప్రస్తుతానికి ఎటువంటి లిఖితపూర్వక ఫిర్యాదు అందలేదని, బాధితులు స్టేషన్‌కు వచ్చి తాము మోసపోయామన్న విషయాన్ని తెలిపారని, లిఖితపూర్వకంగా ఫిర్యాదందితే విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'నన్నయ'లో డిసెంబరులో అంతర్జాతీయ సదస్సు

దివాన్‌చెరువు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 5,6 తేదీల్లో భౌతిక, రసాయన, జీవశాస్త్రాలలో సరిహద్దులు.. వ్యవసాయ-ఆహార సాంకేతికత, ఔషధ ఆవిష్కరణ, పర్యావరణ స్థిరత్వంలో అనువర్తనాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శనివారం వీసీ ఆవిష్కరించారు. సదస్సుకు సంబంధించి నవంబరు 24వ తేదీలోపు పరిశోధనపత్రాలు సమర్పించవచ్చని ఆమె తెలిపారు.

స్కూల్ ఆటోను ఢీకొన్న కారు

ముగ్గురు చిన్నారులకు స్వల్పగాయాలు, ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు





సంఘటనా స్థలంలో వాహనాలు

రాజానగరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం జాతీయ రహదారిపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా శనివారం సాయంత్రం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్కూలు పిల్లలతో దివాన్‌చెరువు నుంచి వస్తున్న ఆటో గైట్ కళాశాల ఎదురుగా యూటర్న్ తీసుకుని సర్వీసు రోడ్డు నుంచి చక్రద్వారబంధం వెళ్తున్న తరుణంలో ఎదురుగా వస్తున్న కారు ఆటోను బలంగా ఢీకొంది. చక్రద్వారబంధం గ్రామానికి చెందిన కొంతమంది దివాన్‌చెరువులోని సూర్యగ్లోబల్ స్కూల్లో 5,6,7 తరగతులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో గైట్ కళాశాల వద్ద సర్వీసు రోడ్డులో కారు ఢీకొనడంతో ఆటో పల్టీలు కొడుతూ బోల్తా పడింది. దీంతో ఉన్న 11 మంది పిల్లల్లో ముగ్గురికి స్వల్పగాయాలు కాగా, ఆటో డ్రైవర్ కుక్కల శ్రీనుకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలను స్కూల్‌కు పంపి...

అనపర్తిలో వివాహిత ఆత్మహత్య

అత్తింటి వేధింపులే కారణమంటున్న మృతురాలి తల్లి



శిరీష (ఫైల్)



పోలీసుల ఒడిలో అమాయకంగా చూస్తున్న శిరీష కుమార్తె

అనపర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో శనివారం జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన నమ్మి సంతోష్ ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడికి ధవళేశ్వరానికి చెందిన శిరీష (30)తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి సంతానం. కొంతకాలంగా వారు అనపర్తిలోని సిందుట వర్క్స్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన తరువాత ఒక పాపను, బాబును స్కూలుకు పంపించిన శిరీష బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు గడియ వేసుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఆమె ఎంతకూ పలకకపోవడంతో అత్త కృష్ణవేణి చుట్టుపక్కల వారిని పిలవగా వారు తలుపును పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సమాచారంతో ఏఎస్ఐ దుర్గాప్రసాద్, ట్రైనీ ఎస్ఐ సుజాత సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా ఉదయం జండూ బామ్ కనిపించడం లేదని అడగగా వెతుక్కోండని శిరీష సమాధానం చెప్పడంతో కొంత ఘర్షణ జరిగిందని, తాను ఇంటి నుంచి వెళ్లిపోయానని సంతోష్ చెప్తున్నాడు. అయితే మృతురాలి తల్లి లంక అమ్మాజీ మాత్రం భర్త, అత్త, ఆడపడుచు వేధింపుల వల్లే తమ కుమార్తె మరణించిందని చెప్తుంది. కుమార్తె మృతితో ముగ్గురు చిన్నారులు దిక్కులేనివారిగా మిగిలారని ఆమె రోదన చూపరులను కలచివేసింది. రెండేళ్లు కూడా నిండని శిరీష కుమార్తె ఇంటికి వచ్చిన పోలీసులను అమ్మ అమ్మ అంటూ మృతదేహం ఉన్న గదివైపు రమ్మని పిలవడం అక్కడున్న వారి హృదయాలను కలచివేసింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియాఆసుపత్రికి తరలించామన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

కాట్రేనికోన, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు జడ్పీ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయుడు ఎం.వెంకటేశ్వరరావు శనివారం సస్పెండ్ అయ్యారు. సహచర ఉపాధ్యాయురాలిని వేధించడమే దీనికి కారణం. తనను వెంకటేశ్వరరావు వేధిస్తున్నాడంటూ జిల్లా విద్యాశాఖాధికారికి బాధిత ఉపాధ్యాయురాలు ఫిర్యాదు చేసింది. డీఈవో షేక్ సలీంబాషా విచారణ నిమిత్తం త్రిమెన్ కమిటీని నియమించారు. త్రిమెన్ కమిటీ నివేదికను డీఈవో సలీంబాషా జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. నివేదికను పరిశీలించిన కలెక్టర్ ఆదేశాలతో వెంకటేశ్వరరావును సస్పెండ్ చేశారు. వెంకటేశ్వరరావుకు సహకరించిన మరో ఉపాధ్యాయుడు ఓ.జగపతిరావును పల్లం జడ్పీహైస్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

అమలాపురం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న ఈదరపల్లికి చెందిన నార్ని రాజా (21) అదృశ్యంపై అమలాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజా శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ పి.వీరబాబు తెలిపారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

కోనసీమ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి దుర్గారావుదొర



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీహెచ్ఎంవో దుర్గారావుదొర

అంబాజీపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్తీ టిఫిన్ తిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర శనివారం పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మెడ్‌యునైటెడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 13 మంది బాధితుల నుంచి డీఎంహెచ్‌వో, తహశీల్దారు చినబాబు వివరాలు సేకరించారు. డీఎంహెచ్‌వో విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 15న అంబాజీపేటలోని ఓ హోటల్‌లో పలువురు టిఫిన్ తిని ఆ రోజు సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురయ్యారన్నారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారన్నారు. ప్రస్తుతం వారందరి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఫుడ్‌పాయిజన్‌కు సంబంధించి ఇప్పటికే వైద్య సిబ్బంది వివరాలు సేకరించడం జరిగిందన్నారు. టిఫిన్ తిన్న ఆ హోటల్‌లో సరుకుల, తాగునీటి శాంపిల్స్‌ను సేకరించి ప్రయోగశాలకు పంపించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆ హోటల్‌ను పరిశీలించారు. ఈవోపీఆర్డీ కె.శ్రీనివాస్, ఆర్ఐ ఏడుకొండలు,హెల్త్‌సూపర్‌వైజర్ రాధానరసింహం, వీఆర్వోలు ఉన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

● ఎస్పీ బిందుమాధవ్

● పరేడ్ గ్రౌండ్‌లో స్వర్ణాంధ్రా- స్వచ్ఛాంధ్రా



మొక్కలు నాటుతున్న ఎస్పీ బిందుమాధవ్



తాళ్లరేవులో విద్యార్థులతో అసిస్టెంట్ కలెక్టర్ మనీషా

కాకినాడ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ జి. బిందుమాధవ్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్రా-స్వచ్ఛాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు తమ కట్టుబాటును తెలియజేస్తూ మొక్కలు నాటడం ద్వారా రేపటితరం ఆరోగ్యవంతంగా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాస్‌రావు, ఎస్‌బీడీ ఎస్పీ కేవీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్‌లు వి.కృష్ణ, టి.రామారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో...

కలెక్టరేట్ (కాకినాడ), (ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాకినాడ కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఈనెలలో సర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం స్వచ్ఛమైన గాలి అనే నినాదంతో నిర్వహించామన్నారు. వాయు కాలుష్యంతో నేడు ప్రజా ఆరోగ్యానికి ఎంతో ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రస్తుతం సమాజంలో వాయుకాలుష్యం మితిమీరిపోయిందని దీన్ని తగ్గించేందుకు అధిక పొగను విడుదల చేసే వాహనాలు, ఫ్యాక్టరీలను నియంత్రించడంతో పాటు పెద్దఎత్తున మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వికాస పీడీ లచ్చారావు, కలెక్టరేట్‌లో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పొల్యూషన్ నియంత్రణలో భాగస్వాములు కావాలి

తాళ్లరేవు,(ఆంధ్రజ్యోతి): పొల్యూషన్ నియంత్రణలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని కాకినాడ అసిస్టెంట్ కలెక్టర్ మనీషా అన్నారు. శనివారం పటవల హైస్కూల్లో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పినపోతు కామేశ్వరరావు, జిల్లాపంచాయతీ అధికారి రవికుమార్, విద్యాశాఖాధికారి రమేష్‌బాబు, మండల విద్యాశాఖాధికార్లు ఉమా, మంగాయమ్మ, ఎంపీడీవో లక్ష్మణరావు, టేకుమూడి లక్ష్మణరావు, శివకుమార్, కాశీశ్వరుడు, సత్తిబాబు పాల్గొన్నారు.

కాకినాడ ఆర్టీసీ డిపోలో..

కార్పొరేషన్(కాకినాడ),(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం కాకినాడ ఆర్టీసీ డిపోలోని సివిల్ ఇంజనీరింగ్‌బ్లాక్‌లో ఉన్న స్క్రాప్ అంతా శుభ్రంచేసి బయటకు తరలించారు. ఈ కార్యక్రమంలో కాకినాడజిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ ఎంవీవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ వి.ధర్మారావు, వీఆర్వో సీహెచ్ వెంకట్‌రాజు పాల్గొన్నారు.

పీఆర్ విద్యార్థుల సైకిల్ ర్యాలీ

కాకినాడరూరల్,(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల్లో ఎన్ఎస్ఎస్ అధికారిణి జి.పావని ఆధ్వర్యంలో స్వచ్ఛమైన గాలి అనే అంశంపై పలు కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. కళాశాల దత్తత గ్రామమైన కొవ్వాడ ఉన్నత పాఠశాల్లో గాలి కాలుష్యంపై అవగాహనా కార్యక్రమం, విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి.సంజీవకుమార్, అధ్యాపకులు డాక్టర్ జయదేవ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో పూర్వ విద్యార్థులు

పిఠాపురం(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకుగానూ పిఠాపురంలోని పాతబస్టాండ్ మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నడుంబిగించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పిఠాపురం అర్బన్ సొసైటీ మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు, హెచ్ఎం సలోమి, ఉపాధ్యాయులు ఆనంద్, రమణ, జగన్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలిపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

జేఎన్టీయూకే(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కాకినాడ జేఎన్టీ యూ, యూసీఈకేలో స్వచ్ఛమైన గాలి అనే అంశంపై ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు, అధ్యాపకులు శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపాల్ ఎన్. మోహన్‌రావు ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు కిరణ్మయి, వీరలక్ష్మి,వాలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అపార్ అప్‌డేషన్‌లో

వెనుకబడకుండా చర్యలు తీసుకోవాలి

● స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌కి హాజరైన ఆర్జేడీ



ఏపీఎస్సీలో భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్జేడీ నాగమణి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):అపార్ అప్‌డేషన్‌లో వెనుకబడకుండా చర్యలు తీసుకోవాలని, నవంబరు 10నుంచి ప్రారంభం కాబోతున్న ఎస్ఏ-1 పరీక్షలకు పూర్తిస్థాయిలో సిలబస్ పూర్తిచేయాలని విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి ఆదేశించారు. శనివారం రమణయ్యపేట ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ భవనంలో నిర్వహిస్తున్న ఏపీఎస్పీ కాంప్లెక్స్ మీటింగ్‌ని సందర్శించి, పలు విషయాలపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఇటీవల జరిగిన ఎఫ్ఏ-2 పరీక్షల సమాధానపత్రాలను నిశితంగా పరిశీలించి, మూల్యాంకనం పూర్తిచేయాలన్నారు. ఎఫ్-1, ఎఫ్-2లో విద్యార్థులకు వచ్చిన మార్కుల్లో ఉన్న వ్యత్యాసాన్ని బేరీజు వేసి, సంబంధిత సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని సీ, డీ గ్రేడులు గుర్తించాలన్నారు. వీరికోసం రిమెడియల్ వర్క్ ప్రణాళిక తయారు చేసుకుని విద్యాసామర్థ్యాలను మెరుగుపరిచి మంచి మార్కులు సాధించేలా విద్యాబోధన చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఉపాధ్యాయులతో మాట్లాడి, మెరుగైన విద్యాబోధన కోసం పలు సూచనలు చేసి, కాంప్లెక్స్ మీటింగ్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పలు భవనాలను పరిశీలించారు. అక్టోబరు నెలాఖరున పదవీవిరమణ చేయనున్న హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.గాయత్రిని ఆర్జేడీ నాగమణి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు చామంతి నాగేశ్వరరావు, కృష్ణవేణి, విజయలక్ష్మి, సత్యనారాయణ మూర్తి, శంకరప్రసాద్, కందుకూరి పాల్‌రాజ్ పాల్గొన్నారు.

నేడు పలువురు బీజేపీ నేతలు కాకినాడ రాక

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సాలగ్రామ లక్ష్మీప్రసన్న అభినందన సభ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం దంటు కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తెలిపారు. అలాగే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, విశిష్టఅతిథిగా కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, పాకా సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పీవీ పార్థసారధి, విష్ణుకుమార్‌రాజు, ఎన్.ఈశ్వరరావు, కూటమి ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తదితరులు హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 8వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రూ.2,22,421 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

సూర్యుడు చెరువు పరిశీలించిన అధికారులు

● నివేదిక కోరిన డిప్యూటీ సీఎం కార్యాలయం



గొల్లప్రోలులోని సూర్యుడు చెరువును పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

గొల్లప్రోలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని సూర్యుడు మంచినీటి చెరువు పరిస్థితిని డ్వామా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అడపా వెంకటలక్ష్మి శనివారం పరిశీలించారు. సూర్యుడు చెరువు కోసం ఇప్పటి వరకూ చేసిన వ్యయం, వివిధ పథకాల మంజూరైన నిధులు, పనుల పురోగతి, ప్రస్తుతం ఉన్న పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. దీనిపై డ్వామా పీడీ పరిశీలన జరిపి ఇంకా ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలనే అంశంపై ఆరా తీశారు. ఆమె వెంట ఏపీవో కొండలరావు, ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధిగా యార్లగడ్డ రామ్‌కుమార్



కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధిగా కాకినాడకు చెందిన యార్లగడ్డ రామ్‌కుమార్‌ను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మరోసారి అవకాశమిచ్చారు. యార్లగడ్డ రామ్‌కుమార్ గత 20 సంవత్సరాలుగా క్రియాశీలకంగా పార్టీలో వ్యవహరిస్తున్నారు. పెద్దాపురం నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. అలాగే యువ మోర్చాలో రాష్ట్రస్థాయిలో పలు బాధ్యతలు, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళతామన్నారు.

వైభవంగా గురు ద్వాదశి



పిఠాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శనివారం గురుద్వాదశి వైభవంగా జరిగింది. శ్రీపాదశ్రీవల్లభులు వారు అంతర్ధానమైన రోజు కావడంతో విశేష పూజలు జరిగాయి. శని ప్రదోష వ్రతాలు, అభిషేకాలు, గోపూజ నిర్వహించారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గ్రోమోర్ ఎరువుల దుకాణం తనిఖీ

పెద్దాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సారావారి వీధిలో ఉన్న మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులను పరిశీలించారు. అనంతరం దుకాణాల యజమానులతో మాట్లాడుతూ ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలన్నారు. ఎరువులు, మందులు పరిశీలించి రైతులకు ఎంత స్టాకు మందులు, ఎరువులు అమ్మారని రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. రైతులకు అందాల్సిన ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కేసులు నమోదుచేస్తామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ నాగరాజు, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏవో కొమ్మొజు సంజయ్‌కుమార్; ఆత్మ ఏటీఎం విష్ణు పాల్గొన్నారు.

దూరప్రాంత భక్తులకు సదుపాయాలు కల్పించాలి

● డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

సామర్లకోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస ఉత్సవాలు పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయానికి వచ్చేభక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించి త్వరితగతిన ఆలయంలో దర్శనాలు అయ్యేవిధంగాఅధికారులు, ధర్మకర్తలమండలి ప్రతినిధులు కృషిచేయాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు. ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న కార్తీకమాస ఉత్సవాలకు సంబంధించి శనివారం సామర్లకోట ఆలయంలో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అనివార్యకారణాల వలన సమావేశానికి హాజరుకాలేకపోవడంతో ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాస రోజులలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేయు భక్తులకు సేవలందించేందుకు అధికారులు సమిష్టి కృషిగా చేయాలన్నారు. మరింతమంది భక్తులను ఆకర్షించేందుకు, ఆలయ విశిష్టత పెంచేందుకు ప్రచార సాధనాలు సైతం దేవదాయ అధికారులు సహకరించాలని సిబ్బందిని బాబు ఆదేశించారు. అంతకు ముందు ఆలయ కోనేరు పుష్కరిణి శుభ్రపరచడం, తాజా నీటితో పుష్కరిణిని నింపడం వంటి చర్యలపై జిల్లా మానవహక్కుల పరిరక్షణ సంఘ అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, జనసేన నాయకులు పిట్టా జానకిరామారావులు అధికారులకు పలు సూచనలు చేశారు. కార్తీకమాసంలో నెల రోజులపాటు నిర్వహించ నున్న వివిధ కార్యక్రమాలకు ధర్మకర్తలమండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) వివరించారు. ఈవో బళ్ళ నీలకంఠం, తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ కమీషనర్ శ్రీవిద్య, టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు, జనసేన నాయకులు సరోజా వాసు, ధర్మకర్తలమండలి సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ధర్మకర్తల మండలి ఆగ్రహం

పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం ధర్మకర్తల మండలి సభ్యులను వివిధ శాఖల అధికారులకు పరిచయం చేయకుండా కార్తీకమాస ఉత్సవాలకు చెందిన సమావేశం నిర్వహించడంపట్ల దేవదాయ అధికారుల తీరుపై పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో కొందరు ధర్మకర్తల మండలి సభ్యులు భేటీ అయ్యారు.భీమేశ్వరాలయానికి ధర్మకర్తలమండలి సభ్యులుగా తమను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గుర్తించి ఎంపిక చేశారని, దేవాదాయ అధికారులు తమను గుర్తించడం లేదన్నారు.

బాలికల సర్వతోముఖాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే పంతం నానాజీ



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరంజంక్షన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్య, ఆరోగ్యం, ఉద్యోగ అవకాశాల్లో విస్తృత అవకాశాలు కల్పించడంద్వారా బాలికల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. శనివారం రమణయ్యపేట కాలువగట్టుపై గల కల్యాణ మండపంలో ఐసీడీఎస్ సీడీపీవో వై.లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవం వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలుపోటీల్లో రాణించిన బాలికలకు బహుమతులను అందించారు. స్వచ్ఛ ఆంధ్రా - స్వర్ణ ఆంధ్రాలో భాగంగా ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో పసుపులేటి సతీష్, గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, బీజేపీ కోఆర్డినేటర్ రంబాల వెంకటేశ్వరరావు, అడబాల రత్నప్రసాదరావు, తాటికాయల వీరబాబు, కుడుపూడి బాలాజీ, తురగా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మార్పుతోనే అభివృద్ధికి నాంది పలుకుదాం

పిఠాపురం(ఆంధ్రజ్యోతి): మార్పునకు శ్రీకారంచుట్టి ప్రతిఒక్కరూ ఆర్థికంగా ఎదగడానికి ఇప్పటినుంచే కృషి చేయాలని, తద్వారా దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాల ముగింపు సందర్భంగా పిఠాపురంలోని ఐసీడీ ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాలల విద్యార్థినులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఎంఈవో జి.శ్యాంబాబు, వైద్యులు డాక్టర్ వరలక్ష్మి, వై.వినయ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణశ్రీ, ప్రభావతి, సారమ్మ. వీరలక్ష్మి, సత్యనారాయణమ్మ, మానసాదేవి, దేవకుమారి పాల్గొన్నారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు

సామర్లకోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శనిత్రయోదశి మహాపర్వదినం పురష్కరించుకుని శనివారం సామర్లకోట గోదావరి ఒడ్డున ఉన్న హరిహరక్షేత్రం అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరాలయంలో తెల్లవారు జామునుంచే పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పరమా నందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలలో సామర్లకోట, పెద్దాపురం, కాకినాడ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు భక్తులు శనీశ్వరస్వామికి తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం రామలింగేశ్వరస్వామికి, అన్న పూర్ణమ్మకు విశేష అభిషేక పూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు.

కోకనాడ షాపింగ్ సంబరాలు



స్టాల్స్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీ వివరాలతో స్థానిక దేవాలయం వీధిలోని పైండా చలమయ్య శ్రీనివాస కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న కోకనాడ షాపింగ్ సంబరాలను శనివారం కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, చేనేత వస్త్రాలు, ఇతరత్రా స్టాల్స్‌ను, సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే కొండబాబు తిలకించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల వస్తువుల ధరలు తగ్గడంతో ప్రజలు ముందుగానే దీపావళి సంబరాలు జరుపుకొంటున్నారన్నారు. కార్యక్రమంలో ది కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గ్రంధి బాబ్జి, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చుశేఖర్, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ డి.శ్రీలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ తోట లలిత, అసిస్టెంట్ కమిషనర్లు కళ్యాణి, లక్ష్మీప్రసన్న, వర్షిణి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లు జి.జీవన్‌కుమార్, వీవీస్వామి పాల్గొన్నారు.

గూగుల్‌తో ఐటీ రంగానికి హబ్‌గా విశాఖ

సర్పవరంజంక్షన్,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పరిపాలనా దక్షతకు గూగుల్‌తో ఒప్పందం నిదర్శనమని, గూగుల్ ఏర్పాటుతో ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రాస్‌గా హైదరాబాద్ తర్వాత విశాఖ అభివృద్ధి చెందనుందని టీడీపీ కాకినాడ రూరల్ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) అన్నారు. శనివారం కరణంగారిసెంటర్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలి ఏఐ హబ్ విశాఖలో ఏర్పాటుచేయడం చారిత్రక ఒప్పందమన్నారు.

తగ్గిన క్రీడా పరికరాల ధరలు

కాకినాడ, అక్టోబర్ 18, (ఆంధ్రజ్యోతి): క్రీడా పరికరాలపై జీఎస్టీ 12శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించడం శుభపరిణామమని డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్ విజయానంద్ పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణ భాగంగా తగ్గిన జీఎస్టీ ధరలపై అవగాహన కల్పిస్తూ కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్‌లో గల జిల్లాక్రీడా మైదానంలో హరీష్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఐటమ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్ విజయానంద్, హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ ప్రారంభించారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి'

కాజులూరు(కరప), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళలు పురుషులతో సమానంగా పోటీపడుతూ అన్ని రంగాల్లో రాణించాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం సూచించారు. కాజులూరు హైస్కూల్‌లో శనివారం తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీవో వై.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ బాలికల దినోత్సవ ముగింపు, 8వ రాష్ట్రీయ పశుపోషణ మాసం ముగింపు సభలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు లేని 125మందిని దత్తత తీసుకుని ఫౌండేషన్ ద్వారా వారికి ఉద్యోగం వచ్చేంత వరకు చదివిస్తున్నట్లు తెలిపారు. రామచంద్రపురం మున్సిపల్ కమీషనర్ రాజు మాట్లాడుతూ బాలికలు పోషకాహారం తీసుకుంటూ శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంతరాయ్, ఎంపీడీవో రాంబాబులు మాట్లాడుతూ మహిళలు నింగి నుంచి నేల వరకు ఎదిగి దేశాన్ని పాలించే స్థాయికి ఎదగడం మనందరికీ గర్వకారణమన్నారు.గర్భిణులకు శ్రీమంతం చేసి చీరలు, గాజులు, పండ్లు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



కలెక్టర్ షాన్‌మోహన్‌కు బ్రోచర్ అందిస్తున్న కాకినాడ కోస్టల్ స్పోర్ట్స్ ఫౌండర్ రవిచంద్ర

ఫస్ట్ కోకనాడ గోల్డ్‌కప్ హాకీ నిర్వహణకు అనుమతులు

● కలెక్టర్‌కు బ్రోచర్ అందజేత

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఫస్ట్ కోకనాడ గోల్డ్ కప్ హాకీ ఇండియా చాంపియన్‌షిప్ 2026ను కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించడానికి హాకీ ఇండియా అనుమతి ఇచ్చింది. ఈనేపథ్యంలో శనివారం కాకినాడ కోస్టల్ స్పోర్ట్స్ ఫౌండర్ రవిచంద్ర, జిల్లా క్రీడాధికారి శ్రీనివాసుకుమార్ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు బ్రోచర్ సమర్పించారు. ఈపోటీలు వచ్చే ఫిబ్రవరి 4 నుంచి 14వతేదీ వరకు నిర్వహిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈపోటీ లలో 12పురుషుల టీమ్‌లు, ఆరు మహిళల టీమ్‌లు పాల్గొంటాయని చెప్పారు. అంతర్జాతీయ గోల్డ్‌కప్ పోటీలుతొలిసారిగా కాకినాడలో జరుగుతున్నాయన్నారు.

నూతన జీఎస్టీ విధానంతో సామాన్య ప్రజలకు ఊరట: ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడసిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీఎస్టీ విధానంతో సామాన్య ప్రజలకు ఊరట కలుగుతోందని కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక 17, 18, 19 డివిజన్లకు సంబంధించి జగన్నాధపురం తూరంగిపేటలో శనివారం సాయంత్రం జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన సభ నిర్వహించారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కరపత్రాలను పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి ఎంపీ మాధుర్ పరామర్శ

తాళ్లరేవు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సుంకరపాలెం దళితనాయకులు విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు చిత్రపటానికి ఎంపీ గంటి హరీష్‌మాధుర్ శనివారం నివాళిలు అర్పించారు. కుటుంబ సభ్యలను పరామర్శించి ఏడుకొండలు మృతికి సంబంధించిన వివరాలను ఎంపీ తెలిసుకున్నారు.

'ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్య దూరం'

కాకినాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని జై భీమ్‌రావ్ భారత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడశ్రావణ్‌కుమార్ అన్నారు. ఆయన తలపెట్టిన మేధోమథన సదస్సు శనివారం కాకినాడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఘనంగా జరిగింది. ముందుగా కాకినాడ ఇంద్రపాలెం సెంటర్‌వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి శ్రావణ్‌కుమార్ పూలమాలలు వేశారు. ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అంశంపై మేధోమధన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయవాది జగ్గారపు మల్లికార్జున అధ్యక్షత వహించారు. జై భీమ్‌రావ్ భారత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథులుగా మాజీ మంత్రి, వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ వంగా గీత హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. బహుజనులకు వైద్య విద్య దూరం చేయాలనే ఆలోచనతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, పీపీపీ విధానంపై ప్రభుత్వానికి అవగాహన లేకుండా పోయిందన్నారు. మాజీ మంత్రి కన్నబాబు మాట్లాడుతూ మేధావులలో పది పేర్లు రాయాలంటే మొదటి పేరు జడ శ్రావణ్‌కుమార్ పేరురాస్తానని, ఆయనను కలవాలని అనుకున్నాగానీ, ఇలా కాకినాడలోనే కలుస్తానని అనుకోలేదన్నారు. మాజీ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాల కోసం చేసిన పోరాటం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందన్నారు.

మానసిక ఒత్తిడి నివారణపై అవగాహన

జీజీహెచ్(కాకినాడ) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలలో భాగంగా శనివారం కాకినాడ జీజీహెచ్‌లో ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలకు మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది ప్రతిఒక్కరూ తమ మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఏదైనా మానసికి సమస్య అనిపించినప్పుడు మానసిక వైద్య విభాగం సేవలు వినియోగించుకోవాలన్నారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వానపల్లి వరప్రసాద్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి సాధ్యమైనంత త్వరగా బయటపడేందుకు సైకియాట్రీ విభాగంలో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి(కరప), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పెదపూడి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఏడాదిన్నర పాలనలో పెదపూడి మండలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని సభ్యులకు వివరించారు. రామేశ్వరంలో లేఅవుట్, నాన్-లేఅవుట్‌లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదికను అందజేయాలన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన, జీఎస్టీ సంస్కరణలతో తగ్గిన ధరలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు శాఖల వారీ జరిగిన అభివృద్ధిని సభ్యులకు వివరించి వారి సందేహాలను నివృత్తిచేశారు. బాణసంచా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి రెండు మూడు రోజుల్లో నష్టపరిహారం అందజేస్తామని ఎమ్మెల్యే స్పష్టంచేశారు.

విజేతలకు బహుమతుల ప్రధానం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ఆయా శాఖల అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. పెద్దాడలో శుక్రవారం రూడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి, యువ నాయకుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డిల సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు బీజేపీలోకి చేరారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు

సామర్లకోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శనిత్రయోదశి పురస్కరించుకుని శనివారం సామర్లకోట గోదావరి ఒడ్డున ఉన్న హరిహరక్షేత్రం అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరాలయంలో తెల్లవారుజాము నుంచి పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పరమా నందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు శనీశ్వరస్వామికి తైలాభిషేకాలు నిర్వహించారు. రామలింగేశ్వరస్వామికి, అన్నపూర్ణమ్మకు అభిషేక పూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు : పీవో



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్

రంపచోడవరం, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని పర్యాటక ప్రాంతాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ తెలిపారు. శనివారం ఐ.పోలవరం, బీరంపల్లిలోని పర్యాటక ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో పర్యాటకానికి అనువుగా ఉన్న ప్రాంతాలను గుర్తించామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాలాజీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, సర్వేయర్ లక్ష్మణ్, ఆర్ఐ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలిని పరిరక్షించుకోవాలి

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్



రాజవొమ్మంగిలో సైకిల్ ర్యాలీలో అధికారులు, ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మనమంతా స్వచ్ఛమైన గాలిని పరిరక్షించుకోవాలని రంపచోడవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ అన్నారు. శనివారం రాజవొమ్మంగిలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. అలాగే జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి ర్యాలీ చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, జడ్పీహెచ్ఎస్ చైర్మన్ మరిచెర్ల శ్రీనివాస్, టీడీపీ నాయకులు గణజాల తాతారావు, బారంగి అనుదీప్, ఎంఈవోలు సత్యనారాయణ దొర, సూరయ్య రెడ్డి, హెచ్ఎం ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

' పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

రంపచోడవరం, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీటీసీ వంశీ కుంజం అన్నారు. శనివారం చినబారంగిలో స్వచ్ఛమైన గాలి అనే ర్యాలీ నిర్వహించి, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్కూల్ ఆవరణలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది రాజశేఖర్, సౌజన్య, రోషిణి, బాపనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమాలు

దేవీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాలు, ఇతర కార్యాలయాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర , స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రపరిచి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెకుముకి సైన్స్ సంబరాలు

కూనవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెకుముకి సైన్స్ సంబరాలు శనివారంతో ముగిశాయి. ఏపీ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం ఎనిమిది పాఠశాలల్లో జరిగింది. కూనవరం మండలంలో 370 మంది విద్యార్థులు, ఎటపాక మండలంలో 150 మంది, చింతూరులో 600 మంది, వీఆర్‌పురంలో 300 మంది విద్యార్థులు ప్రతిభ పరీక్షల్లో పాల్గొన్నట్టు నాలుగు మండలాల ఇన్‌చార్జి పి.కన్నారావు తెలిపారు.

కూనవరం తహశీల్దార్‌కు వినతి

కూనవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పోలవరం పరిహారం తీసుకుని, ఆ భూములను లీజుకిస్తున్న గిరిజనేతరుల భూస్వాముల పేర్లు సర్వే చేయించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు, దానిపై కలెక్టర్ విచారణ జరిపిస్తామని కిందిస్థాయి అధికారులకు సూచించినప్పటికీ, ఇంతవరకు ఎటువంటి సర్వేలు జరగలేదని గిరిజన సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాబు బుర్రయ్య, పాయం సీతారామయ్య, తెల్లం తమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయిలో వాహనాల తనిఖీ

మోతుగూడెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వై. రామవరం మండలం పంచాయతీ బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద డొంకరాయి ఇన్చార్జి ఎస్సై హుస్సేన్ , పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్సులు లేని వాహనాలను పరిశీలించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపిన, పర్యాటకుల ముసుగులో గంజాయి రవాణా చేస్తున్న, అతివేగంగా వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. తనిఖీల్లో సివిల్ పోలీసులు కల్యాణ్, సీఆర్పీఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

25 లోగా పంట నమోదు చేయించుకోండి

చింతూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 లోగా రైతులు తమ పంటలను నమోదు చేయించుకోవాలని చింతూరు ఏవో రత్నప్రభ పేర్కొన్నారు. శనివారం ఏవో బృందం ఎర్రంపేట, వేగితోటలో పంటలను పరిశీలించారు. మండలంలో 94 శాతం పంట నమోదు కార్యక్రమం జరిగిందన్నారు. ఇంకనూ పంట నమోదు చేయించని రైతులు తమ పరిదిలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి సంబంధిత డాక్యుమెంట్లను చూయించి నమోదు చేయించుకోవాలని కోరారు. పంటలతో పాటు పంట వేయని భూములను నమోదు చేస్తున్నట్టు ఏవో పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సాయి కిరణ్, శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన బొడ్డగండి ఎంపీటీసీ -2 బృందం

చింతూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బొడ్డగండి ఎంపీటీసీ-2 కరక వెంకటరమణ బృందం శనివారం మంగళగిరిలో సీఎం చంద్రబాబుని కలిశారు. మేజరు గ్రామ పంచాయితీలైన సీలేరు, మోతుగూడెం, డొంకరాయిలో కలిపి మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని శుక్రవారం మంగళగిరి టీడీపీ కార్యాలయం ముందు బొడ్డగండి గ్రామ పంచాయతీ వాసులు ప్లెక్లీలు ప్రదర్శించిన విషయం విధితమే. ఆ సమయంలో పార్టీ కార్యాలయంలో ఉన్న టీడీపీ నేత వర్ల రామయ్యకు కూడా బొడ్డగండి పంచాయతీ ప్రజలు, ఎంపీటీసీ - 2 వెంకటరమణ తాము మండల కేంద్రానికి వెళ్లేందుకు పడుతున్న కష్టాల గురించి వివరించారు. కలిసిన వారిలో టీడీపీ నాయకులు నీలాపు సత్యనారాయణ, కరకా ప్రేమ్ కిరణ్, మద్దెల యాకూబ్ దంగా రాజు ఉన్నారు.

గండిపోశమ్మ దర్శనం తాత్కాలికంగా నిలుపుదల

దేవీపట్నం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గొందూరులో వెలసిన స్వయంభూ గండిపోశమ్మ వారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ గోదావరి నీరు, బురదతో నిండి ఉన్నాయన్నారు. దర్శనాలకు అనుమతించే తేదీ ప్రకటించే వరకు భక్తులు ఎవరూ ఆలయ పరిసరాలకు రావద్దని పేర్కొన్నారు.

90 శాతం సబ్సిడీతో అపరాల పంపిణీ

కూనవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు గాను రైతులకు 90 శాతం సబ్సిడీతో అపరాలు పంపిణీ చేస్తున్నట్టు మండల వ్యవసాయ శాఖ అధికారిణి సీహెచ్ దేవి అన్నారు. రైతులకు మినుములు, పెసర పంపిణీ చేసినట్లు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు, సోమక సత్యనారాయణ, జనసేన మండలాధ్యక్షుడు నరేంద్ర పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుకలు





వెండి కిరీటంతో నెహ్రూను సత్కరిస్తున్న తుమ్మలపల్లి రమేష్, వెంకటేశ్వరస్వామి చిత్రపటం అందిస్తున్న అడపా శ్రీనివాస్

జగ్గంపేట/గండేపల్లి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుకలు శనివారం జెడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. జనసేన జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై నెహ్రూకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నెహ్రూకి వెండి కిరీటం పెట్టి, శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. బంగారు వెంకటేశ్వరస్వామి,పద్మావతి అమ్మవార్ల గోల్డ్ ప్లేట్లు బహూకరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, రాయి సాయి, వేములకొండ జోగారావు, పీల మహేష్, నండ్ల చిరంజీవి, వెలిశెట్టి బుజ్జి, బాలాజీ రెడ్డి, కోడూరి రమేష్, ముక్క పాలు బాబు, నలమాటి ఆనంద్, వైభోగుల కొండబాబు యాదవ్, వైభోగుల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాజానగరం జనసేన సీనియర్ నాయకుడు అడపా శ్రీనివాస్ వీడియో కాల్‌లో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నెహ్రూతో అడపా శ్రీనివాస్ కేక్ కట్ చేయించి దుశ్శాలువాతో సన్మానించి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ప్రత్తిపాడు, తుని, కాకినాడ, కాకినాడ రూరల్, మండపేట ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, యనమల దివ్య, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, అనంతబాబు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, రుడాచైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, మెట్ల రమణబాబు, గుణ్ణం చంద్రమౌళి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే సత్యప్రభ శుభాకాంక్షలు

ప్రత్తిపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జన్మదినం సందర్భంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గజమాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం జ్యోతుల దంపతులతో కలిసి కేక్ కట్ చేయించి ఎమ్మెల్యే నెహ్రూకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వెన్నాశివ, ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, నియోజకవర్గ సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ళ జగదీష్ శుభాకాంక్షలు తెలిపారు.

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయవాది శివ

ఏలేశ్వరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): యర్రవరంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ నేతృత్వంలో జాగృతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. హైకోర్టు ఆదేశాలతో ప్రజల ఫిర్యాదు మేరకు లీగల్ మండల కమిటీ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్యానల్ న్యాయవాది బుగతా శివ పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, ప్యానల్ న్యాయవాదులు అవసరాల దేవి, ఆకాశపు మల్లేశ్వరరావు, కలవలపల్లి సుజన పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు మృతి



రౌతులపూడి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మాజీ సర్పంచ్ వాసిరెడ్డి వెంకటేశ్వర్లు (దేవుళ్లు) (81) శనివారం మృతి చెందారు. కత్తిపూడి సత్రం చైర్మన్‌గా, సర్పంచ్‌గా ఆయన సేవలందించారు. వెంకటేశ్వర్లు మృతదేహానికి వైసీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి ముద్రగడ గిరి నివాళులర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది వచ్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్‌లెర్నింగ్ డిపార్టుమెంటు, ఆదిత్య లెర్నింగ్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన బిల్డ్ స్మార్ట్ సొల్యూషన్స్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అండ్ ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ విత్ ఈఎస్‌పి 32 వర్క్‌షాప్ ముగిసింది. ఐదు రోజులు జరిగిన వర్క్‌షాప్‌నకు రిసోర్సుపర్సన్‌గా బాపూజీ కనపర్తి వ్యవహరించారు.

వర్షం నీరు పోయే మార్గం చూపండి!



యాదవ కాలనీ వద్ద రహదారిపై వర్షం నీరు

రౌతులపూడి,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): వర్షం నీరు పోయే మార్గం చూపాలని రౌతులపూడికి చెందిన యాదవకాలనీవాసులు కోరుతున్నారు. వర్షం నీరు పోయే మార్గంలేక కాలనీలోకి వేళ్లేందుకు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఉన్నతాధికారులు స్పందించి నీరు పోయేమార్గం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జగ్గంపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం జగ్గంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాకినాడ రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో జగ్గంపేటలో ద్విచక్ర వాహనాల షోరూమ్ యజమానులు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విజన్‌తో తుని అభివృద్ధి: ఎమ్మెల్యే దివ్య



తునిలో మాట్లాడుతున్న యనమల దివ్య

తుని రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి విజన్‌తో ముందుకు వెళ్తున్నట్టు ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అత్యాధునిక వసతులతో కూడిన చాంబర్‌ను శనివారం ఆమె ప్రారంభించి తొలి సమీక్ష నిర్వహించారు. విజన్-2047 ప్రణాళిక అమల్లో భాగంగా నియోజకవర్గ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి అధికారులతో సమీక్షించారు. శాఖాధిపతులకు పలు సూచనలు ఇచ్చారు. అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి లక్ష్య సాధనకు చేరువకావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్,నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, ఎంపీపీ రాము, మూడు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తొండంగి: గర్భిణులకు సారె అందిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తొండంగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. శనివారం పెరుమాళ్ళపురంలో కిషోర వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. తల్లీబిడ్డల సంక్షేమానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో సాయి నవీన్, టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, మహంకాళి, కాలిబోయిన చంద్రరావు పాల్గొన్నారు.

పంట నమోదు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో గాంధీ

శంఖవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పంట నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయాధికారి పి.గాంధీ సిబ్బందికి తెలిపారు. శనివారం రైతు సేవా కేంద్ర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటల పరిస్థితిని సమీక్షించారు. వీఆర్వో ప్రసాద్, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



ధర్మవరంలో మహిళలకు సత్యదీక్ష కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రచారకర్త కృష్ణబాబు

సత్యదీక్షలపై ప్రచారం

ప్రత్తిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో శనివారం అన్నవరం సత్యదేవుడి దీక్షలపై ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు మహిళా భక్తులు, గ్రామస్తులకు కరపత్రాలను పంపిణీ చేశారు. స్వామివారి 18 రోజుల సత్యదీక్షలు ఈనెల 26 నుంచి ప్రారంభమవుతాయన్నారు. నవంబరు 5వ తేదీ కార్తీక పౌర్ణమి రోజున స్వామివారి గిరిప్రదక్షిణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో భక్తులు నాగలక్ష్మి, పద్మ, వరలక్ష్మి, మంగమ్మ పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ

యువకులకు ఎస్ఐ కౌన్సిలింగ్

కోటనందూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తుని-కోటనందూరు రహదారిపై పలువురు మైనర్లు లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతుండటంతో వారిని ఆపి కౌన్సిలింగ్ ఇచ్చామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా చర్యలు చేపడుతున్నామన్నారు.



కబడ్డీ పోటీలో ఉత్సాహంగా ఆడుతున్న విద్యార్థులు

ముగిసిన క్రీడా పోటీలు

తొండంగి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రావికంపాడు ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న మండలస్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చెస్, షటిల్, కబడ్డీ, ఖోఖో, యోగా తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ప్రసాదరావు, ఎంఈవో 2 సుబ్బిరెడ్డి, పీడీ నర్సింహమూర్తి ఈ పోటీలను పర్యవేక్షించారు.



ప్రత్తిపాడులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ప్రత్తిపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ర్యాలీని ఎంపీడీవో ప్రారంభించారు. అధికారులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బలక్ష్మి, గ్రామ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి పాల్గొన్నారు. ప్రభుత్వాసుపత్రి వద్ద సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రపరిచి ఆరోగ్య సిబ్బంది మొక్కలు నాటారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నేత మాతిరెడ్డి భాస్కర్‌రావు, మాతిరెడ్డి జయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అలాగే ఎంపీడీవో వెంకటనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో మాతిరెడ్డి బాబులు, సి.ప్రకాశ్, వీరబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కోటనందూరు మండలం జగన్నాథపురంలో స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్న దృశ్యం



సమావేశంలో ఐక్యత చాటుతున్న నాయకులు

పోరాటాలతో హక్కులు కాపాడుకోవాలి

ప్రత్తిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాటాలతో హక్కులు కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్ వద్ద సీఐటీయూ మండల మహాసభ నిర్వహించారు. సీఐటీయూ జెండాను సీనియర్ కార్మికులు పుల్లమ్మ ఆవిష్కరించగా కార్మిక ఉద్యమనేత సీతారాం ఏచూరి చిత్రపటానికి సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, ఆర్. ఈశ్వరరావు నివాళులర్పించారు. మండల కార్యదర్శి ఈశ్వరరావు మూడేళ్లుగా చేపట్టిన కార్యక్రమాల నివేదిక వివరించారు. మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమలో హేమలత, మరియ, చిన్నారి లక్ష్మి, మంగాలక్ష్మి, లలిత, సత్యవతి, పాదాలయ్య, దుర్గాప్రసాద్, లహరి పాల్గొన్నారు.

గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి

ప్రత్తిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు(శివ) అన్నారు. ప్రత్తిపాడులో శనివారం ఆయన మాట్లాడుతూ గూగుల్ రాకతో రాష్ట్రం వైపు ప్రపంచ దేశాలు ఆసక్తిగా చూస్తున్నాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, సీడీపీవో అధికారులు

అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలపై సమీక్ష

ప్రత్తిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లో 21 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అప్ గ్రేడియేషన్ (సక్షామ్) మంజూరైనట్టు ప్రాజెక్టు సీడీపీవో వి.పద్మావతి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు అధ్యక్షతన అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సీడీపీవో పద్మావతి ప్రత్తిపాడు మండలంలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలు, ఏలేశ్వరంలోని 15 అంగన్‌వాడీ కేంద్రాలు సక్షామ్ పథకంలో ఎంపికైనట్టు తెలిపారు. దీనిలో భాగంగా ఆ కేంద్రాలకు న్యూట్రీ గార్డెన్‌లు, మల్టీ సదుపాయాలు, ఆర్వో ప్లాంట్‌లు వంటివి మంజూరయ్యాయని తెలిపారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బలక్ష్మి, ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ సెక్రటరీ జ్యోతుల పద్మరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.